

రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

చిట్వేల్-రైల్వేకోడూరు రహదారి విస్తరణ పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం రోడ్డు పనులను కలెక్టర్ పరిశీలించారు. రోడ్డు భవనాల శాఖ ఇఇ సహదేవరెడ్డి ఈ ప్రాజెక్ట్ కింద రూ.3530 లక్షల అంచనా వ్యయంతో పనులు చేపట్టామని కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటివరకు పనులలో 63 శాతం పనులకు గాను రూ.1731 లక్షల పనులు పూర్తయ్యాయని చెప్పారు. 3/3 నుండి 15/4 వరకు, 17/9 నుండి 20/4 వరకు సింగిల్ రోడ్డు నుండి డబుల్ రోడ్డు చేసే పని పురోగతిలో ఉన్నదని, అందులో 25 కల్వర్టులు, సిడి వర్కులు పూర్తి అయ్యాయని, 3 కిలోమీటర్లకు గాను 2.7 కిలోమీటర్లు సిసి రోడ్లను పూర్తిచేశామని, పది కిలోమీటర్లు బిటి రోడ్డు పురోగతిలో ఉందని కలెక్టర్‌కు వివరించారు. పనుల పురోగతిపై కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ మిగిలిన రోడ్డు పనులు ఆర్‌అండ్‌బి శాఖ నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రజాశక్తి-ఓబులవారిపల్లె (రైల్వేకోడూరు)

విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన మంచి భోజనం అందించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. మంగళవారం ఓబులవారిపల్లి మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాన్ని (కెజిబివి) ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల పరిసరాలను, విద్యార్థుల విద్యా పరిస్థితులను, మౌలిక సదుపాయాలను ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న బాలికలతో మాట్లాడి వారి విద్య సామర్థ్యాలను పరిశీలించారు. వారికి పాఠశాలలో అందిస్తున్న వసతులు, భోజన నాణ్యత, బోధన విధానం వంటి అంశాలపై అడిగి వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ పాఠశాల తాగునీటిని, వంటశాలను, పరిశీలించి, అక్కడ వండుతున్న ఆహారం పరిశుభ్రత, నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని వంటకు ఉపయోగిస్తున్న పదార్థాలను పరిశీలించారు. కూరగాయలు ఎక్కడినుంచి వస్తున్నాయని, ఏజెన్సీ వారు సమయానికి కూరగాయలు పంపిస్తున్నారా తాజా కూరగాయలను ఉపయోగించి రుచికరంగా, పోషక విలువలతో కూడిన ఆహారం విద్యార్థినుల ఆరోగ్యాన్ని కాపాడే దిశగా ప్రత్యేక శ్రద్ధ వహించాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు ఏలాంటి అనారోగ్య సమస్యల బారిన పడకుండా తరచుగా ఎఎన్ఎంలు తరచుగా పరీక్షలు నిర్వహించాలని, ఆనారోగ్య భారిన పడకుండా సలహాలు సూచనలు ఇవ్వాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. విద్యార్థినుల విద్యా ప్రగతిని ప్రతి నెలా సమీక్షిస్తూ, విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఉపాధ్యాయులు విద్యార్థుల వ్యక్తిగత అభ్యాస స్థాయిని గుర్తించి, దాన్ని మెరుగుపరచే విధంగా ప్రత్యేక దృష్టి పెట్టాలని పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థినుల సమగ్ర అభివృద్ధి కోసం క్రీడా కార్యక్రమాలు, ఇతర అనుబంధ కార్యక్రమాలలో ప్రోత్సహించాలని సూచించారు. పాఠశాల పరిశుభ్రత, వసతి గృహాల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ ఉండాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బాలికల భవిష్యత్తు బలపడాలంటే మంచి విద్యతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం, క్రీడా ప్రోత్సాహం, క్రమశిక్షణ ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యా నాణ్యతను మరింత మెరుగుపరచడానికి సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కొత్తగా నిర్మిస్తున్న భవనాన్ని సందర్శించి ప్రభుత్వం నిర్ణయించిన గడువు లోపల భవనాన్ని పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలి

ఉద్యాన పంటల సాగును మరింత ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

అధికారులను ఆదేశించారు. ఓబులవారిపల్లి మండలంలోని బి.కమ్మపల్లి పరిధిలోని వెంకటేష్ ప్రసాద్, బాబు నాయుడు, ఇతర రైతుల మామిడి, బొప్పాయి, అరటి, నన్నారి పంటను ఎమ్మెల్యే శ్రీధర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల నుండి వివిధ రకాల సమస్యలు సలహాలును తెలుసుకొని వారి సమస్యలను పరిష్కరించెందుకు హార్టికల్చర్ అధికారులను తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారి సుభాషిని, తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్, మండల హార్టికల్చర్ అధికారి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. రైల్వేకోడూరు పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సందర్శించి, ఆరోగ్య సదుపాయాలను, వైద్య సేవల స్థితిగతులను ఎమ్మెల్యే శ్రీధర్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రిలోని ఇసిజి రూం, క్యాజువాలిటీ వార్డు, ఆపరేషన్ థియేటర్ ఐసోలేషన్-ఒటి, ఎల్‌డిఆర్ యూనిట్, ప్రిపరేషన్ రూమ్, ప్రసూతి వార్డును పరిశీలించి, రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే శ్రీధర్ మాట్లాడుతూ సిహెచ్‌సిలో ఆక్సిజన్ ప్లాంట్, సిఐపి బెడ్స్ తక్కువ ఉన్నాయని, ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది కొరత ఉందని ఈ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లానని పేర్కొన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు నివేదికలు తయారుచేసి ప్రభుత్వం దృష్టికి పంపి వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ ఆంజనేయులు, డాక్టర్లు బ్రహ్మ కుమారి, ధనుశ్రీ, పృథ్విని, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కలివికోడి అన్వేషణ ముమ్మరం



ఇటీవలి కూత రికార్డింగ్‌తో పెరిగిన ఆశలు

లంకమల అభయారణ్యంలో ఐదు ప్రాంతాలు గుర్తింపు

శబ్దం, ఉనికి గుర్తింపుపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఎట్టకేలకు కలివికోడి ప్రాజెక్టులో కదలిక వచ్చింది. నెల రోజుల కిందట కలివికోడి కూతలు సౌండ్ సిస్టమ్స్‌లో రికార్డు అయినట్లు తేలింది. అటవీ పర్యావరణ మంత్రిత్వశాఖ కలివికోడి ప్రాజెక్టు పరిశోధన ముమ్మరం చేసింది. జిల్లాలోని సిద్ధవటం మండల పరిధిలోని లంకమల అభయారణ్యంలో ఐదు ప్రాంతాలను గుర్తించింది. ఫలితంగా ప్రాజెక్టు పరిశోధకులు అత్యాధునిక కెమెరాలు, రికార్డు సౌండ్ సిస్టమ్స్ ఏర్పాటు వ్యవస్థలను ఏర్పాటు చేసింది. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి కలివికోడి పరిశోధనా కార్యకలాపాలను ముమ్మరం చేసింది. ప్రపంచంలోనే అంతరించిపోతున్న అరుదైన పక్షి జాతుల్లో కలివికోడి (జోర్డాన్‌కర్సర్) ఒకటి. 1900లో మహారాష్ట్ర, తెలంగాణలోని అదిలాబాద్ జిల్లా ప్రాంతాల్లో కనిపించింది. అనంతరం 1986లో కడప జిల్లాలోని సిద్ధవటం-అట్లూరు మండల ప్రాంతాల్లో కనిపించింది. జిల్లాలో కలివికోడి ప్రాజెక్టు కింద రూ.50 లక్షల నుంచి రూ.50 కోట్లతో పరిశోధనను ముమ్మరం చేశారు. ప్రపంచంలోనే అంతరించిపోతున్న అరుదైన పక్షిజాతి పరిశోధన ప్రాజెక్టును కొన్నేళ్లపాటు 14 నుంచి 16 అత్యాధునిక కెమెరాల సహాయంతో సౌండ్, రికార్డింగ్, పక్షి ఫొటో రికార్డర్లతో పరిశోధించారు. జిల్లా అటవీశాఖతోపాటు ఎన్‌సిఎఫ్, మరో రెండు ఎన్‌జిఒ సంస్థలు సంయుక్తంగా అన్వేషణలో పాలుపంచుకున్నాయి. ఏళ్ల తరబడి కలివికోడి కనిపించని నేపథ్యంలో మూడేళ్ల కింద మూసివేసిన సంగతి తెలిసిందే. ముంబయ్‌కు చెందిన బాంబే నేచరల్ ఆఫ్ హిస్టరీ సెంటర్ (బిహెచ్ఎన్ఎస్) కన్సర్వేషన్‌కు చెందిన అధికారి మెరైన్ బయాలజీ వైపు మొగ్గు చూపడమే ప్రధాన కారణమనే వాదన వినిపించింది. అంతకు ముందు డైరెక్టర్‌గా పనిచేసిన జగన్నాథం రాష్ట్రంలో (బర్డ్ స్పీసెస్) బట్టమేక పక్షిమీద ప్రయోగాలు చేసిన అనుభవం ఉంది. అనంతరం బాధ్యతలు చేపట్టిన బిహెచ్ఎన్ ఎస్ఎస్ డైరెక్టర్ ఆసక్తి చూపకపోవడంతో స్తబ్దత నెలకొంది. మూడేళ్ల కిందట నుంచి కలివికోడి ప్రాజెక్టు పరిశోధనా ప్రక్రియ మూలన పడింది. నెల రోజుల కిందట కలివికోడి కదలికలు, సౌండ్ సిస్టమ్స్‌లో రికార్డు కావడం, పక్షి ప్రేమికులు కలివికోడి కూత తాము విన్నట్లు ఇంటర్నెట్‌లో పెట్టిన నేపథ్యంలో కలివికోడి అన్వేషణ ప్రక్రియను మరోసారి పునరుద్ధరించడం గమనార్హం.



కలివికోడి రికార్డింగ్ వార్తలు వాస్తవమే

కలివికోడి శబ్దాన్ని రికార్డింగ్ చేసినట్లు వార్తలు వచ్చిన మాట వాస్తవమే. లంకమల అభయారణ్యంలో కలివికోడి కూతను పోలిన పక్షుల కూతలను సైతం పోల్చుకుని వాస్తవానికి రావాల్సి ఉంది. కలివికోడి ప్రాజెక్టు పరిశోధనను వేగవంతం చేశాం.

- వినీత్‌కుమార్, డిఎఫ్ఒ, కడప.

ఆడపిల్లలను సమానంగా చూద్దాం

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

సమాజంలోని ప్రతిఒక్కరూ ఆడ పిల్లలను మగపిల్లలతో సమానంగా చూడాలని వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ జిల్లా మాస్ మీడియా అధికారిని దేవ శిరోమణి కోరారు. అంతర్జాతీయ బాలిక వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం పట్టణంలో వైద్య ఆరోగ్య శాఖ, శిశు సంక్షేమశాఖ, విద్యా శాఖలు సంయుక్తంగా నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణం నుంచి నేతాజీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా దేవ శిరోమణి మాట్లాడుతూ గర్భిణులు తమకు పుట్టబోయేది ఆడ లేక మగ పిల్ల అని తెలుసుకోవడం గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం 1994 ప్రకారం నేరం అన్నారు. అలాంటి వారికి మూడు సంవత్సరాల శిక్షతో పాటు రూ. 10 వేల జరిమానా విధిస్తారని చెప్పారు. అంతర్జాతీయ బాలికల వారోత్సవాలను పురస్కరించుకుని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 'గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం, ఆడపిల్లలను కాపాడుకుందాం' అనే అంశంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కుటుంబంలో మగపిల్లలతో సమాన గా ఆడపిల్లలను చూడడం తో పాటు ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగంలో అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ, ఆశ , ఆరో గ్య కార్యకర్తలు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

మదనపల్లె అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు పఠాన్ ఖాదర్‌ఖాన్, విశ్వబ్రాహ్మణ డైరెక్టర్ పచ్చిపాల రామకృష్ణ ఆచారి, మాజీ కౌన్సిలర్ బాబు నాయుడు కోరారు. మంగళవారం స్థానిక ఉడా కార్యాలయానికి వచ్చిన ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్ బాబును వారు మర్యాద పూర్వకంగా కలిశారు. పూలబొకే అందజేసి, శాలువతో సన్మానించారు. ఉడాలో భాగమైన మదనపల్లెను అన్నివిధాల అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఛైర్మన్ అభివృద్ధిపైనే ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఛైర్మన్‌ను కలిసిన వారిలో కొత్త ఇండ్లు దొరస్వామి నాయుడు, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు నాగూరువల్లి, ఇంతియాజ్ బాబ్జాన్, తదితరులు ఉన్నారు.

నవంబరు 23న భగవద్గీత పోటీలు

ప్రజాశక్తి-రాజంపేట

టిటిడి, హిందూ ధర్మ ప్రచార పరిషత్తు జిల్లా శాఖ ఆధ్వర్యంలో గీతా జయంతిని పురస్కరించుకొని నవంబరు 23వ తేదీ నుండి భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు పట్టణంలోని మన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రోగ్రామ్ అసిస్టెంట్ డాక్టర్ టి.గోపి బాబు, ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణలు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. 6 నుండి 9వ తరగతి వరకు విద్యార్థులకు ఒక విభాగంగా భగవద్గీత 14వ అధ్యాయం గుణత్రయ విభాగయోగంపై పోటీలు ఉంటాయన్నారు. 10వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకుగల విద్యార్థులకు భగవద్గీత 16వ అధ్యాయం దైవాసుర సంపద్విభాగయోగంపై పోటీలు ఉంటాయన్నారు. 18 సంవత్సరాల నుండి 45 సంవత్సరాల వరకు ఉన్న వారికి నిత్యజీవితంలో భగవద్గీత-భావ విశ్లేషణ అనే అంశంపై పోటీలు ఉంటాయన్నారు. ప్రతి విభాగం నుండి ప్రథమ రూ.1116, ద్వితీయ రూ.816, తృతీయ రూ.516 బహుమతులుగా ఉంటాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో విద్యార్థులను ఈ పోటీలలో పాల్గొనేలా చూసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జాక్‌పాట్‌ను పూర్తిగా రద్దు చేయాలి

- రైతులపై దాడిచేసిన వ్యాపారిని అరెస్టు చేయాలి
- ఎపి రైతు సంఘం నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-గుర్రంకొండ

మార్కెట్ యార్డులో టమోటా పంటకు జాక్‌పాట్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వి.వెంకటరమణారెడ్డి, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రమేష్ బాబు డిమాండ్ చేశారు. మంగళవారం మార్కెట్ యార్డులో పర్యటించి రైతులతో చర్చించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్ కమిటీ కార్యదర్శి కుమార్‌రెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుర్రంకొండ మార్కెట్ యార్డులో వ్యాపారుల ఆగడాలు మితిమీరి పోయాయని పేర్కొన్నారు. జాక్‌పాట్ విధానాన్ని రద్దు చేయాలని తెలిపారు. అడిగిన పాపానికి రైతులపై హత్యాయత్నంకు పాల్పడుతున్న వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా జాక్‌పాట్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని, ఎంత ధర పాడితే అంతా చెల్లించాలని డిమాండ్ చేశారు. కమీషన్ 10 శాతం వసూలు చేయడం దుర్మార్గమని తెలిపారు. నాలుగు శాతం మాత్రమే వసూలు చేయాలని పేర్కొన్నారు. జాక్‌పాట్ రద్దు చేయడంతో పాటు రైతుల సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. లేని పక్షంలో రైతులను కూడగట్టి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు నాయకులు పి.శ్రీనివాసులు, అమరనాధ, రైతులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

రాయచోటి : గుర్రంకొండ, రాయచోటి మార్కెట్ యార్డుల్లో టామోటా,



మార్కెట్ కమిటీ కార్యదర్శితో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

మామిడిఅమ్మకాలు చేపట్టడానికి ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టి, రైతులకు న్యాయం చేయాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయచోటి మార్కెట్ యార్డులో మామిడి కాయల కొనుగోలు, అమ్మకాలు చేపట్టాలని కోరారు. కొందరు మండీ వ్యాపారులు రైతులను మోసం చేసేందుకు సిద్ధపడుతున్నారని తెలిపారు. గుర్రంకొండ మార్కెట్ యార్డులో టామోటా అమ్మకాల్లో వ్యాపారులు అక్రమ లబ్ధి పొందేందుకు ఏర్పాటు చేసుకొన్న జాక్‌పాట్ విధానం రద్దు చేసి రైతుల డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని రాయచోటి మార్కెట్ యార్డులో నూతనంగా టమోటా అమ్మకాలు, కోనుగోలు చేపట్టాలని పేర్కొన్నారు. సమీప మండలాల రైతులకు, ప్రజలకు వ్యాపారులకు చాలా సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. కలెక్టర్, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవతో రైతులకు న్యాయం చేయాలని కోరారు.

ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేందుకు వైసిపి కుట్రలు

ప్రజాశక్తి -మదనపల్లె అర్బన్

కూటమి ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేందుకు వైసిపి కుట్రలు పన్నుతోందని, తప్పులు చేసి వాటిని కప్పిపుచ్చుకోవడం వారికి షరా మామూలేనని టిడిపి రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్.జె.వేంకటేష్ ఆరోపించారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ములకలచెరువు మండలంలో కల్తీ మద్యం తయారీ అంశం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించగా అందులో జయచంద్రారెడ్డి ప్రమేయం ఉందని తెలియగానే పార్టీ అతనిని సస్పెండ్ చేసిందన్నారు. ఈ కల్తీ మద్యం తయారీలో ఎ1గా ఉన్న అద్దేపల్లి జనార్ధన్‌రావు వైసిపి నాయకుడు, మాజీ మంత్రి జోగి రమేష్ ఆదేశాల మేరకే కల్తీ మద్యం తయారీ చేయడం జరిగిందని వాంగ్మూలంలో పోలీసులకు తెలిపారని, ఇది వైసిపి, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి చెంపపెట్టు లాంటిదని పేర్కొన్నారు. వైసిపి నాయకులు అవినీతి, అక్రమాలకు పాల్పడి, అనేక కుట్రలు చేసి టిడిపిపై రుద్దిన విషయాలను ఆయన గుర్తుచేశారు. వివేకా హత్య కేసును చంద్రబాబు నాయుడిపై మోపారని, కోనసీమలో కులాల మధ్య చిచ్చు పెట్టడం, కోడికత్తి డ్రామా, గులకరాయి దాడి, అంబేద్కర్ విగ్రహానికి నిప్పుపెట్టడం వంటి కార్యక్రమాలను వైసిపీ చేసి వాటిని టిడిపిపై మోపిందన్నారు. 2019 నుండి 2024 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని వైసిపి సర్వనాశనం చేస్తే కూటమి ప్రభుత్వం పునర్నిర్మాణం చేస్తోందన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకుడు అన్వర్ బాష, టిఎన్ఎస్ఎఫ్ నాయకుడు గండికోట గణేష్ బాబు, గ్రామకమిటీ అధ్యక్షుడు బి.మల్లికార్జున, షేక్ ఇమామ్ సాబ్, మాజీ సర్పంచ్ లక్ష్మన్న, విద్యాసాగర్, గుర్రప్ప పాల్గొన్నారు.

అభివృద్ధితోనే గ్రామస్వరాజ్యం సాకారం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పంచాయతీల అభివృద్ధితోనే గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం సాకారమవుతుందని కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతి పేర్కొన్నారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ తాజ్ మస్రూర్ అధ్యక్షతన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల ముగింపు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా జాతిపిత మహాత్మా గాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చలపతి మాట్లాడుతూ పంచాయతీలే దేశాభివృద్ధికి పట్టుకొమ్మలన్నారు. పంచాయతీలు బాగుంటే దేశం ఆర్థిక పరిపుష్టి సాధిస్తుందన్నారు. గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనలో సర్పంచులదే క్రియాశీలక పాత్రన్నారు. సర్పంచ్‌ల శిక్షణా కార్యక్రమం చాలా ఉపయోగకరంగా ఉందని, ఇది పాలనకు ఎంతో దోహదపడుతుందన్నారు. ఎంపిడిఒ మాట్లాడుతూ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి పంచాయతీల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలన్నారు. మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. ఆర్థిక సంఘం నిధులు, పంచాయతీరాజ్ నిధులు సద్వినియోగం చేసుకుని పంచాయతీల అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పవన్ కుమార్, మణి కుమార్, వివిధ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని తోతాపురి మామిడి రైతులలో ఆనందం వ్యక్తం చేస్తున్నారుని కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రూ.9.08 కోట్ల 2271 మంది రైతులకు 22,706 టన్నులకు, టన్నుకు రూ.నాలుగు వేలు చొప్పున రైతులకు ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం విడుదల చేసిందిన్నారు. ఈ ఆర్థిక సాయం వల్ల ముఖ్యంగా రైల్వేకోడూరు, చిట్వేలు, రాజంపేట, పీలేరు, రాయచోటి, మదనపల్లె మండలాల రైతులకు లబ్ధి చేకూరిందిన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ ఆర్థిక సహాయం అందించబడిందని రైతులందరూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నారని పేర్కొన్నారు. రైతులకు ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా ఉద్యానవనం శాఖ అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లా యంత్రాంగం రైతులకు ఎప్పుడు అండగా ఉంటుందని, తోటకూరి మామిడి రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే తమను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయానికి రైతులందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రైతులు తమ అకౌంట్లో జమ అయిన మెసేజ్ ను చూపిస్తూ వారి ఆనందాన్ని వ్యక్తం చేశారని తెలిపారు.

వృత్తి పట్ల అంకితభావంతో పనిచేయండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వృత్తి పట్ల అంకితభావంతో పనిచేయాలని మెగా డిఎస్‌సి-2025లో ఎంపికై బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులకు ఎంఇఒ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. మంగళవారం పట్టణంలోని ఉర్దూ పాఠశాలలో నూతన ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టిన విష్ణువర్ధన్, షాహీనా, స్వాతిలకు ఆయన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షాజహాన్, సిఆర్‌పి రెడ్డిశేఖర్‌రెడ్డిలతో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైందన్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించడం చాలా కష్టమన్నారు. సిఎం, లోకేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

జనంతో కూటమి ప్రభుత్వం చెలగాటం :'చింతల'



నిరసన తెలుపుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-పీలేరు

కూటమి ప్రభుత్వం జనంతో చెలగాటం ఆడుతోందని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం పీలేరు ఎక్సైజ్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యాన్ని ఓ కుటీర పరిశ్రమగా నిర్వహించుకునేందుకు ప్రోత్సహిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని పేర్కొన్నారు. అడుగడుగునా బెల్టు షాపులు కూడా నిర్వహిస్తూ పేద వాడి జేబులు కొల్లగొట్టడమే కాకుండా కల్తీ మద్యాన్ని ప్రోత్సహిస్తూ మద్యం వినియోగదారుల ఆరోగ్యాన్ని కూడా నాశనం వేస్తున్నారని విమర్శించారు. నకిలీ మద్యంపై సిట్ దర్యాప్తు హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బెల్ట్ షాపుల ద్వారా నకలి మద్యం విచ్చలవిడిగా అమ్మకాలు జరుపుతున్నా ఈ కూటమి ప్రభుత్వం స్పందించలేదని చెప్పారు. మొలకల చేరువు నుంచి మన రాష్ట్రం, మన దేశం దాడి ఆఫ్రికా కూడా కల్తీ మద్యం రాకెట్ విస్తరించిందని ఆరోపించారు. వాస్తవాలు సమాధి చేయడం కోసమే చంద్రబాబు నాయుడు సిట్ విచారణకు ఆదేశాలు ఇచ్చారని, చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే నకిలీ మద్యం కుంభకోణంపై సిబిఐ దర్యాప్తు కోరాలని హితవు పలికారు. చంద్రబాబు నాయుడు ఒక నియంతలా వ్యవహరిస్తూ పత్రికా స్వేచ్ఛను కూడా హరిస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం బెదిరింపులు, కేసులతో ఎవరినీ భయపెట్టలేదని, 2029 శాసనసభ ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మళ్ళీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని జోష్యం చెప్పారు. అనంతరం ఎక్సైజ్ ఎస్ఐ చైతన్యకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో స్థానిక ఎంపిపి సతీష్ కుమార్‌రెడ్డి, వైస్ ఎంపిపిలు హరిత, రైల్వే చలపతి, జడ్‌పిటిసి రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీం, వైసిపి మండల కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి, తదితర నియోజకవర్గస్థాయి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల చెంతకు ఆధునిక సాంకేతికత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యార్థుల చెంతకు ఆధునిక సాంకేతికతను తీసుకొచ్చేందుకు స్టెమ్ ల్యాబ్ ఎంతో ఉపయోగంగా ఉంటుందని ఫోర్డ్ సంస్థ డైరెక్టర్ లలితమ్మ అన్నారు. ఫోర్డ్ సంస్థ ఆధ్వర్యంలో క్రై సంస్థ సహకారంలో జడ్‌పి హైస్కూల్‌లో స్టెమ్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. మంగళవారం ల్యాబ్‌ను ఆమె సందర్శించారు. విద్యార్థులతో కలిసి ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన 200కు పైగా ఎగ్జిబిట్స్‌ను పరిశీలించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో గ్రామీణ పేద విద్యార్థులు విద్యను అభ్యసిస్తుంటారని, వారి కలలను సాకారం చేసుకోవడానికి స్టెమ్‌ల్యాబ్ ఎంతో దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ ల్యాబ్‌లో సుమారు 200కు పైగా ఎగ్జిబిట్స్ తోపాటు, చేసే ప్రయోగానికి సంబందించిన తయారీని ప్రదర్శించారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా రూ.8 లక్షల అంచనా వ్యయంతో ల్యాబ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్.ఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ స్టెమ్ ల్యాబ్ పాఠశాలలో ఏర్పాటు చేయడం విద్యార్థులకు వరమని పేర్కొన్నారు. అలాగే విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీసి వారికి సైన్స్ ప్రయోగాల ప్రయోజనాలను, ఆసక్తిని పెంపొందించడానికి ఇది ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఎంఇఒ-2 రాజగోపాల్ మట్లాడుతూ గ్రామీణ పేద విద్యార్థులు విద్యతోపాటు సైన్స్ పరిశోధనల్లో ఆసక్తిని పెంపొందించడానికి ఈ ల్యాబ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందుకు సహకారం అందించిన క్రై సంస్థకు, ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిన పోర్డ్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. లలితమ్మ మాట్లాడుతూ గ్రామీణ పేద విద్యార్థులు సైన్స్ పరిజ్ఞానం, పరిశోధనల పట్ల అభివృద్ధిని, ఆసక్తిని పెంపొందించి లక్ష్యాలను చేరుకోవడానికి క్రై సంస్థ సహకారంతో స్టెమ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. బాపూజీ హైస్కూల్, పెద్దమండ్యం మండలం కలిచెర్ల, వెలిగల్లు హైస్కూల్స్‌లో ఈ లాబ్స్ ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. పేద, గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తు కలలు సాకారం చేసుకోవడానికి ఇవి దోహదం చేస్తాయన్నారు.



స్టెమ్ ల్యాబ్ ఉపయోగాలను వివరిస్తున్న ఫోర్డ్ సంస్థ డైరెక్టర్ లలితమ్మ



క్రీడల్లో పతకాలు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

ఎస్‌జిఎఫ్ గేమ్స్‌కు ఎంపికైన ఎస్‌వి విద్యార్థులు

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

ఎస్‌జిఎఫ్ అండర్-19 గేమ్స్ పోటీలలో 19మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఎస్‌వి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌ఎన్ శ్రీనివాసులు, డైరెక్టర్ వసుంధర తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కడప జిల్లా పోరుమామిళ్లలో జరిగిన సాఫ్ట్‌బాల్ అండ్ బేస్ బాల్, రైల్వేకోడూరులో జరిగిన కబడ్డీ అండ్ క్రికెట్, రాయచోటి చిన్నమండెంలో జరిగిన వాలీబాల్ పోటీలలో మంచి ప్రతిభ కనబరచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని అన్నారు. ఈ పోటీలలో ఎంపికైన 19 మంది విద్యార్థులను ఎస్‌వి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌ఎన్ శ్రీనివాసులు డైరెక్టర్ ఎస్ వసుంధర , ఫిజికల్ డైరెక్టర్ పుల్లారావు,అధ్యాపక అధ్యాపకేతర బృందం అభినందించారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పతకాలు

రైల్వేకోడూరు: అండర్-14, అండర్-17 స్కూల్ గేమ్స్ పోటీలలో మండల పరిధిలోని ఆర్ రాచపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు సత్తా చాటారని ప్రధానోపాధ్యాయులు సి.వి సత్యనారాయణ తెలిపారు. ఇటీవల ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ అండర్14,400 మీటర్లలో హసిని మొదటి స్థానం, అండర్-14 600 మీటర్లలో సుబ్రహ్మణ్యం మొదటి స్థానం, అండర్-17.100 మీటర్లలో బాలిక లలో కోమల ప్రియ మొదటి స్థానం, అండర్-17, డిస్క్ బాలురు శ్రీమాన్ నారా యణ మొదటి స్థానం, అండర్-17, డిస్క్ బాలికలలో కోమలప్రియ మొదటి స్థానం,శ్రావ్య రెండో స్థానం అండర్-14 బాలికల మొదటి స్థానం చంద్రకళ, రెండవ స్థానం కీర్తన, అండర్14 షార్ట్ పుట్ బాలికల పద్మావతి మొదటి స్థానం, అండర్-17 షాట్ పుట్ బాలికలు, మొదటి స్థానం కోమల ప్రియ, రెండో స్థానం శ్రావ్య, అండర్-17. జావెలిన్ బాలుర మొదటి స్థానం వేదిక, అం డర్-17 జావెలిన్ బాలికల మొదటి స్థానం కోమలప్రియ, రెండవ స్థానం మోక్ష విజేతలగా నిలిచి విద్యార్థిని విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు సి.వి సత్యనా రాయణ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సి.శివశంకర్,విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

డబుల్స్ క్యారమ్స్ విజేత తమిళనాడు

నందలూరు : యంగ్ మెన్స్ క్యారమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దక్షిణ భారతస్థాయిలో మూడు రోజుల పాటు జరిగిన క్యారమ్స్ పోటీల్లో, డబుల్స్ కేటగిరీలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన చెన్నై జట్టు విన్నర్స్ గా నిలిచి రూ.40వేలు నగదును, రన్నర్స్ గా కోయంబత్తూరు జట్టు రూ.25వేలను నగదును కైవసం చేసుకుంది.సింగిల్స్ కేటగిరీలో మొదటి బహుమతి 25వేల రూపాయలను కేరళకు చెందిన నసీర్ . రన్నర్స్‌గా గుంతకల్‌కు చెందిన పవన్‌కు రూ.15వేలు నగదును దక్కించుకున్నారు. సెమీఫైనల్ లో ఓడిపోయిన క్రీడాకారులకు, క్వార్టర్ ఫైనల్లో ఓడిపోయిన క్రీడాకారులకు కూడా నగదు బహు మతులను అందించారు.కార్యక్రమంలో యంగ్ మెన్స్ క్యారమ్స్ అసోసి యేషన్ కమిటీ అధ్యక్షులు బియన్ శంకర్, కమిటీ సభ్యులు విశ్వనాథ్, గ్రిఫుల్ రెడ్డి, నాగభూషణం, సుధాకర్, హరి ప్రసాద్, నారాయణ, సామ్రాజ్ పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి : అన్నదానం కు మించి మరొక దానం లేదు లక్కి రెడ్డి పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ షఫీ నాయక్ అన్నారు. మంగళవారం మండలంలో పాటు ఇతర ప్రాంతాల నుంచి జీవాల సంతకు వచ్చే ప్రజలకు మార్కెట్ కమిటీ సంత ప్రాంతంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎస్ఎండి షఫీ నాయక్, రవి పాల్గొన్నారు

ఆడపుల మాలపల్లెలో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి-రామాపురం: మండలంలోని గోపగుడిపల్లి గ్రామంలో ఆడపూరి మాలపల్లెకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మద్ది సుమిత్ర అన్నారు. మంగళవారం ఆడపాల మాలపల్లె సమస్యలను అడిగి తెలుసుకున్నారు, ఇప్పటికైనా ఆడపలమాలపల్లెలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి

ప్రజాశక్తి-వీరబల్లి : సమాజంలో ప్లాస్టిక్‌ను రూపుమాపి, ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చి దిద్దాలని ప్రిన్సిపల్ అజంతల్లా తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని వత్తల గ్రామమైన పెద్ద మారెగుంపెద్ద పల్లెలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం స్పెషల్ క్యాంపులో భాగంగా 50మంది విద్యా వాలంటరీలు గ్రామాల్లో తిరిగి ప్లాస్టిక్ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ సంచులు ఏరివేశారు. ఈ సందర్భంగా ప్రిన్సి పల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ భాస్కర్, రఘురామయ్యలు మాట్లా డుతూ ఏడు రోజులపాటు ఎన్ ఎస్ఎస్ ప్రోగ్రాంలో పాల్గొన్న విద్యార్థులందరూ చాలా కష్టపడ్డారు పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రతి గ్రామంలో చేపడితే ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దవచ్చని తెలిపారు. ప్రపంచానికి సవాలుగా మారిన ప్లాస్టిక్ వాడకం తగ్గించి, పర్యావరణహిత ఉత్పత్తులను ఉపయోగించుకోవాలన్నారు. విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్ర మంలో అధ్యాపకులు శ్యాంసుందర్‌రెడ్డి, రాధాకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు వరం సిఎం సహాయనిధి

ప్రజాశక్తి-పుల్లంపేట : ఓబులవారిపల్లె మండల పరిధిలోని చిన్న ఓరంపాడు గ్రామపంచాయతీ ఆయ్యలరాజు పల్లికి చెందిన వంకన శ్రీకాంత్‌రెడ్డికి రూ.3,88,101ల సిఎం సహాయ నిధి చెక్కును రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి సతీమణి ముక్కా వరలక్ష్మి చేతుల మీదుగా బాధితులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అండ గా నిలవడమే కూటమి ప్రభుత్వ పాలన ముఖ్య ఉద్దేశ మన్నారు. సిఎం సహాయనిధి ద్వారా ఎన్నో వందలాది కుటుంబాలు లబ్ధి పొందుతు న్నాయ ని పేర్కొన్నారు. సాయం అవసరమైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం చేయూత అంది ంచే దిశగా కృషి చేస్తుందని చెప్పారు. సీఎం సహాయనిధి ప్రజలకు ఆర్థికంగా తోడ్పడు తుందన్నారు. కార్యక్రమంలోనాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి నియామకాలు జరిగేదెప్పుడో..?

తాత్కాలిక అధికారులతో నత్తనడకన అభివృద్ధి పనులు



ప్రజాశక్తి-బి.కొత్తకోట

నగర పంచాయతీకి రెగ్యులర్ హౌసింగ్ ఎఇ, ఇంజినీర్లు లేకపోవడంతో అభివృద్ధి పనులు నత్తనడక సాగుతున్నాయి. డిప్యుటేషన్ ఇన్‌ఛార్జిలుగా ఉన్న అధికారులు తూతూమంత్రంగా విధులు నిర్వహిస్తున్నట్లు పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. విధులకు ఎప్పుడొస్తారో, ఎప్పుడు వెళ్తారో తెలియక చాలామంది ప్రజలు సతమతమవుతున్నారు. నగర పంచాయతీ పరిధిలో ఐదేళ్ల విధులు నిర్వహించిన వారిని డిప్యుటేషన్ మీద కాకుండా రెగ్యులర్ ఉద్యోగులని నియమించాలని పలువురు ప్రజలు కోరుకుంటున్నారు. ఈ విషయమై నగర పంచాయతీ కమిషనర్ పల్లవిని వివరణ కోరగా రెగ్యులర్ ఉద్యోగులను ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులతో చర్చించడం జరిగిందన్నారు. నగర పంచాయతీ అభివృద్ధి, డ్రెయినేజీలు నిర్మాణం కోసం రూ.80 లక్షలు మంజూరుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. నిధులు మంజూరవగానే డ్రైనేజీలు పనులు చేపడుతామని తెలిపారు. నిధులు మంజూరయ్యేలోపు నగర పంచాయతీ అర్బన్‌లో సచివాలయాలకు ఇంజినీర్లు నిర్మించేందుకు కృషి చేస్తామని, ఇంజనీర్లు అవసరం ఉందని ఇంజనీర్లు బాధ్యతలు చేపట్టిన వెంటనే ఇంకా ఎక్కడెక్కడ డ్రెయినేజీలు అవసరమో గుర్తించి రూ.80 లక్షల నిధులతో నిర్మిస్తామని ఆమె వెల్లడించారు.



మున్సిపల్ కమిషనర్ పల్లవి

వేదవ్యాస పాఠశాలలో డిఎంహెచ్ఒ విచారణ



విద్యార్థులను విచారిస్తున్న డిఎంహెచ్ఒ డాక్టర్ లక్ష్మీ నరసయ్య

ప్రజాశక్తి-బి.కొత్తకోట

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ లక్ష్మీ నరసయ్య మంగళవారం ఋషి వాటిక వేదవ్యాస పాఠశాలను సందర్శించారు. ఇటీవల ఆ పాఠశాలలో విద్యార్థి శేషాద్రిరెడ్డి కంటి గాయానికి గురైన ఘటన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యక్తిగతంగా విచారణ చేపట్టారు. ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడి సంఘటన జరిగిన తీరును తెలుసుకున్నారు. గాయపడిన విద్యార్థికి అందించిన ప్రథమ చికిత్స, వైద్య సహాయంపై అందించిన వివరాలను ఆరా తీశారు. పాఠశాలలో ఉన్న అత్యవసర వైద్య సదుపాయాలు, భద్రతా చర్యలను సమీక్షించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పాఠశాల నిర్వాహకులకు సూచనలు ఇచ్చారు. విచారణ అనంతరం సంఘటనకు సంబంధించిన అన్ని వివరాలతో కూడిన సమగ్ర విచారణ నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామని తెలిపారు. గాయపడిన విద్యార్థికి అవసరమైన వైద్య సహాయం, పర్యవేక్షణ, శ్రద్ధ అందించేందుకు ఆరోగ్య శాఖ చర్యలు కొనసాగిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.శ్రీధర్, టిబి పర్యవేక్షకులు ప్రభాకర్, సిబ్బంది విజయలక్ష్మి, రెడ్డెమ్మ, ప్రమీల పాల్గొన్నారు.

నాణ్యతగా మధ్యాహ్న భోజనం : డిఇఒ

ప్రజాశక్తి-పుల్లంపేట

విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత ఉండాలని డిఇఒ డాక్టర్ కె. సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం మండలం లోని ఆదర్శ పాఠశాల, కస్తూర్బా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ తరగతుల విద్యార్థులకు ఉపాధ్యాయులకు సలహాలు, సూచ నలు అందించారు. అనంతరం ఆదర్శ పాఠశాలలో, విద్యార్థులకు కెరీయర్ గైడెన్స్ గురించి వివరించారు. కస్తూర్బా పాఠశాలలో వంటగదిని తనిఖీ చేశారు, సాయంత్రం వేళ అందించేటువంటి స్నాక్స్‌ని మెనూ ప్రకారం ఇస్తు న్నారా లేదా మెనూ చార్ట్‌ని పరిశీలన చేశారు. సమస్యలపై విద్యార్థులతను అడిగి తెలు సుకున్నారు. కార్యక్రమంలోజిల్లా ఎంఇఒ జి.చక్రధర్‌రాజు, నాగ తిరుమలరావు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ లీలాశ్రీహరి, కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపల్ కెసి.రూత్‌మేరీ పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డిఇఒ సుబ్రహ్మణ్యం

దీపావళికి ఆకర్షణీయమైన బహుమతులు

- మౌళి రియల్ ఎస్టేట్ సంస్థ శ్రీకరం మోహన్

ప్రజాశక్తి-మదనపల్లె

దీపావళి పండుగను పురస్కరించుకొని మదనపల్లెలోని మౌళి రియల్ ఎస్టేట్ సంస్థ కొనుగోలు దారుల కోసం ఆకర్షణీయమైన బంపర్ ఆఫర్లను ప్రకటించిదని సంస్థ నిర్వాహకులు ఎస్.మోహన్ తెలిపారు. రాయలసీమలో చారిత్రాత్మక ప్రాధాన్యం కలిగిన మదనపల్లె ఇప్పుడు వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్ట ణంగా మారుతోంది. ఇక్కడ రియల్ ఎస్టేట్ రంగం బలంగా ఎదుగుతోంది. భూముల్లో పెట్టుబడి పెట్టడం భవిష్యత్తుకు మేలైన ఆస్తిగా మారుతుందన్నారు. పట్టణ సమీ పంలోని అంగల్లు సమీపంలో టెర్రకోట వద్ద ఈ కొత్త వెంచర్ స్థాపించబడిందని చెప్పారు. ఈ ప్రాంతం ప్రకృతి సౌందర్యానికి ప్రసిద్ధి చెందడంతో పాటు, జిడ్డు కృష్ణ మూర్తి స్థాపించిన రిషివ్యాలీ విద్యాసంస్థల సమీపంలో ఉండటం విద్యా వాతా వరణానికి ప్రత్యేక గుర్తింపు తెస్తుందని తెలిపారు. ఈ వెంచర్ పూర్తిగా డిటిసిపి అప్రూవ్డ్ ప్రాజెక్టు అని ఆయన వివరించారు. ఇందులో40 అడుగుల విస్తారమైన రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ సిస్టమ్, విశాలమైన పార్కులు, పార్కింగ్ సదుపాయం, యువసేన రూమ్ వంటి ఆధునిక వసతులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.ఈ వెంచర్ పట్టణ అభివృద్ధి దిశగా మదనపల్లెకు కొత్త ఉత్సాహాన్ని తెస్తోందని ఆయన పేర్కొన్నారు. దీపావళి సందర్భంగా ప్లాట్ కొనుగోలు చేసే వారికి సంస్థ బంపర్ బహుమతులను ప్రకటించింది. అందులో మొదటి బహుమతి కారు,రెండో బహుమతి బుల్లెట్ బైక్, ప్లాట్ కొనుగోలు చేసిన ప్రతి ఒక్కరికి 10 గ్రాముల బంగారు నాణెం బహుమతిగా అందించ బడుతుందని మోహన్ తెలిపారు. అదనంగా, ప్లాట్ కొనుగోలు దారుల కోసం బ్యాంకు రుణం సౌకర్యం కూడా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ఉద్యోగులు, మధ్యతరగతి కుటుంబాల కోసం ఈ వెంచర్ ప్రత్యేకంగా ఉద్యోగులు, మధ్య తరగతి కుటుం బాల అవస రాలను దృష్టిలో ఉంచుకొని రూపుది ద్దుకున్నదని వివరించారు. తక్కువ పెట్టుబడితో భద్రత కలిగిన సొంత ఇల్లు కలగాలనే ఆశ కలిగిన కుటుంబాలకు ఇది ఒక ఉత్తమ అవకాశమని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, అనేక బుకింగ్స్ నమోదైనట్లు తెలిపారు.మా లక్ష్యం కేవలం ప్లాట్లు అమ్మడం కాదు, ప్రజలకు భద్రతతో కూడిన సొంత ఇల్లు కల్పించడమని తెలిపారు.



సమస్యలపై తక్షణమే స్పందించాలి : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-గుర్రంకొండ

అధికారులు వద్దకు వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి మంగళవారం జరిగిన అధికారుల సమీక్ష సమావేశంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం లో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్, హౌసింగ్ అధికారులు గురించి ఎక్కువ గా ప్రజల నుంచి సమస్యలు వస్తున్నాయని పేర్కొన్నారు. అధికారులు సక్రమంగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని, కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా సమస్యలను త్వరగా పరిష్కరించాలని రెవెన్యూ, విద్యుత్ అధికారులకు సూచించారు. గండికోట నుంచి పీలేరు నియోజకవర్గంలోని గుర్రంకొండ మండలానికి వస్తున్న తాగునీటి పైపులైన్, వాటర్ ట్యాంక్ నిర్మాణాల గురుంచి ఆర్‌డబ్ల్యుజెస్ అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారం చూపా లని పేర్కొన్నారు. గ్రామంలోని 50 విద్యుత్ పోల్స్ మార్చాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వేణుగోపాల్‌రెడ్డి, తహశీల్దార్, సింగల్ విండో చైర్మన్ ఎంఎల్ఎన్ మూర్తిరావు, మండల టిడిపి అధ్యక్షులు జగదీష్, మాజీ సర్పంచ్ నౌషాద్‌అహ్మద్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు

ఆర్థిక అక్షరాస్యతతోనే అభివృద్ధి : ఎంఇఒ

ప్రజాశక్తి-సుండుపల్లి

ఆర్థిక అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యమని ఎంఇఒ రవీంద్రనాయక్ తెలిపారు. మంగళవారం సుండుపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యత పై ప్రధానోపాధ్యాయురాలు జక్రియాబేగం ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ దేశ భవిష్యత్ ప్రణా ళికలు రూపకల్పనలో ఆర్థిక అక్షరాస్యత ఎంతో ఉపయోగప డుతుందని పేర్కొన్నారు. పిల్లలు పాఠశాల స్థాయి నుంచి నానాటికి పెరుగుతున్న సైబర్ నేరాలపై ఆర్థిక మోసాలపై చక్కటి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. వివిధ యాప్‌ల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు జన సురక్ష, పిఎం విశ్వకర్మ, యువజన ముద్ర లాంటి పథకాలు సద్వినియోగం చేసుకునేటప్పుడు చక్కటి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎవరికి ఓటిపిలు చెప్పకూడదని, వాట్సాప్ ఫిగర్లను ఓపెన్ చేయరాదని, అపరిచిత వ్యక్తులతో వాట్సాప్ చాటింగ్‌లు చేయరాదని పిల్లలకు అవగాహన కల్పిం చారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు.ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర మహిళ కుటుంబానికి పునాది

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంతమైన కుటుంబానికి బలమైన పునాది అని ఐసిడిఎస్ ఎసిడిపిఒ టి.సరళాదేవి అన్నారు. మంగళవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం సమావేశ మందిరంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె అంగ న్వాడీ కార్యకర్తలు, ఆయాలతో మాట్లాడుతూ స్థూలకాయం నివారణకు చక్కెర, నూనె వినియోగం తగ్గించాలని, బాల్య దశ సంరక్షణ,విద్య, శిశు, చిన్న పిల్లల ఆహారపు అలవాట్లు,పోషణ, సంరక్షణలో పురుషుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలని సూచించారు. గ్రామీణ శక్తికి మార్గం పోషణకు బలమైన సమన్వయ చర్యలు డిజిటలీకరణ ద్వారా సమగ్ర పోషణకు బలమైన అడుగు పడుతుందన్నారు. అంగన్వాడీ చిన్నారులకు అం దించే పౌష్టిక ఆహారాన్ని, పండ్లు ప్రదర్శనగా ఉంచారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు ఎ.సుబ్బలక్ష్మి, కె.యశోద, అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎసిడిపిఒ సరళాదేవి

పట్టణ పారిశుధ్యానికే 'నమస్తే'

ప్రజాశక్తి-బి.కొత్తకోట

వీధుల్లో వ్యర్థాలను సేకరించి అమ్ముకుని జీవనం సాగించే వారి భద్రత, గౌరవాన్ని పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్(నమస్తే)ను రూపొందించాయని నగర పంచాయతీ కమిషనర్ పల్లవి పేర్కొన్నారు. మంగళవారం నమస్తే జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ జివి.సుబ్రమణ్యం, పుత్తూరు కో-ఆర్డినేటర్ ఎ.కవితరాణి చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. పట్టణ పరిధిలో ఉన్న స్క్రాప్ షాపుల యజమానులు, వేస్ట్ ఫెలో రిక్వెక్కర్స్,హెయిర్ పికెల్స్ అందరిని మున్సిపల్ కార్యాలయంలో సమావేశ పరిచి నమస్తే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.వి.ఎస్ బాబు మాట్లాడుతూ పట్టణంలో వేస్ట్ పికర్స్ చెత్త కుప్పల్లో ,రోడ్ల పక్కన ఇతర ప్రాంతాల్లో కొంతమంది జీవన ఉపాధి కోసం ప్లాస్టిక్ బాటిల్స్, ఇనుప వస్తువులను, ప్లాస్టిక్ వస్తువులను సేకరించి స్క్రాప్ షాపుల వద్దకు వెళ్లి అమ్ముతుంటారని తెలిపారు. అలాగే రాగ్ పికర్స్ వీరు వీధుల్లో రోడ్డు పక్కన, ఇతర ప్రాంతాల్లో బట్టలు, గోనెలు వంటి వ్యర్థాలను సేకరించి స్క్రాప్ కొట్టులకి అమ్మి జీవనోపాధి కొనసాగిస్తుంటారన్నారు. వీరి కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇలా జీవనాన్ని కొనసాగించిన కార్మికులనుగుర్తించి మురుగు కాలువలు, చెత్తకుప్పల్లో, పెద్ద పెద్ద డ్రెయినేజీ ఇలా ప్రమాదకరమైన పనులను తగ్గించి యాంత్రిక పద్ధతులను ప్రోత్సహించడం వీరికి తగిన శిక్షణ అందించడం ద్వారా వారి పనిని సంస్థగతీకరించడం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో శ్రావ్య ఇన్ఫోటెక్ కంప్యూటర్స్ అధినేత మోహన, జమ్మలమడుగు వారి సిబ్బంది, పుత్తూరు కో-ఆర్డినేటర్ (చైతన్య సర్వీస్ సొసైటీ) కవిత రాణి, ఎఇ లోకేష్ రెడ్డి, స్థానిక గుజిరే యజమానులు సిద్ధిక్, ఖలీల్ మహబూబ్‌బాషా, మునిసిపల్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

జిఎస్‌టి తగ్గింపుతో పేద ప్రజలకు ఊరట

ప్రజాశక్తి-ములకలచెరువు : జిఎస్‌టి తగ్గింపుతో పేద ప్రజలకు ఊరటనిస్తోందని ద్వామా పీడీ వెంకటరత్నం, మండల కన్వీనర్ పాలగిరిసిద్ద పేర్కొన్నారు. సిఎల్ఆర్‌సి భవనంలో మంగళవారం అధికారులు, సంఘమిత్రలు, సచివాలయం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎల్ఆర్ సీ భవనం నందు పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడి వెంకటరత్నం మాట్లా డుతూ జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఎక్కడైన పాత జీఎస్టీని అమలు చేస్తే చర్యలు తప్పవన్నారు. పేద, మధ్యం తరగతి వర్గాల కు, వ్యవసాయ, విద్యా, వ్యాపార రంగానికి సూపర్ జిఎస్‌టి గిఫ్ట్ వచ్చిందన్నారు. వస్తువులపై ఎవ్వరైనా పాత జీఎస్టీ అమలు చేస్తుంటే వెంటనే, టోల్ ఫ్రీ నెంబరికు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ హరినారాయణ, ఎస్ఐ నరసింహుడు, జనసేన ఇన్‌ఛార్జి సాయినాథ్, నాయకులు చెన్నక్రిష్ణ, నాగరా జుయాదవ్, వెంకటస్వామి, రెడ్డెప్ప, శివన్న, సోముశేఖర్ పాల్గొన్నారు.

నేడు మండల అభివృద్ధిపై సమీక్ష

- హాజరుకానున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు : టిడిపి మండల స్థాయి సమీక్షా సమావేశం పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామమూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల కు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పీలేరు డివిజన్, మండలస్థాయి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.కార్యక్రమానికి కూటమి నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, యూనిట్ ఇన్చార్జిలు, బూత్ కన్వీనర్లు, ఏజెంట్లు, గ్రామ కమిటీ అధ్యక్షులు, అన్ని విభాగాల అనుబంధ సంఘాల నాయకులు, మహిళలు పాల్గొనాలని పిలుపు నిచ్చారు.

క్రైం కార్నర్

చిరు వ్యాపారిపై టిడిపి నాయకుడు దాడి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భూ వివాదంలో చిరు వ్యాపారిపై టిడిపి నాయకుడు దౌర్జన్యం చేసి, చితక బాది, భూమిలోకి అడుగు పెట్టావంటే చంపుతానని బెదిరించిన సంఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. బాధితుని కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మదనపల్లె పట్టణం, సురభి కాలనీ చెందిన మోహన్‌మురళీ హంద్రీనీవా కాలువ సమీపంలో 1997లో మరో రైతు నుంచి 19 స్థలాన్ని కొనుగోలు చేశాడని తెలిపారు. ఇటీవల అపోలం పక్కనే మదనపల్లికి చెందిన టిడిపి నాయకుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ కొడవలి శివప్రసాద్ కొంత భూమిని కొనుగోలు చేసి, మోహన్ మురళికి చెందిన భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేశారని చెప్పారు. పలుమార్లు ఘర్షణలు పడ్డారని పేర్కొన్నారు. తన వద్ద రికార్డులు పక్కాగా ఉన్నాయని, బ్రిటిష్ కాలం నాటి హద్దులతోనే తను పొలాన్ని కొన్నానని మోహన్ మురళి ఎంత చెప్పిన వినిపించుకోలేదన్నారు. మంగళవారం మోహన్‌మురళి తన పొలంలో పనులు చేసుకుంఃటుండగా అక్కడి చేరుకున్న శివప్రసాద్ తన డ్రైవర్‌తో కలిసి అతనిపై దాడి చేసి పిడుగుద్దులు గుద్ది, చితకబాదాడని తెలిపారు. మరోసారి పొలం లోకి అడుగుపెట్టావంటే చంపేస్తానంటూ హెచ్చరించారని చెప్పారు. స్థానికులు అడ్డుకొని బాధితున్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై తాలూకా పోలీసులు విచారణ చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : భర్త వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సంఘటన మంగళవారం పట్టణంలో చోటుచేసుకుంది. బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మద నపల్లె పట్టణం, మోతి నగర్‌కు చెందిన షేక్ వసీమ్ రామసముద్రంకు చెందిన హీనాకౌసర్‌ను రెండేళ్లక్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఏడాది వయసున్న కుమారుడు ఉన్నాడు. గత కొంతకాలంగా భార్యను అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నాడు. తరచూ కొట్టడం, తిడుతూ హింసిం చేవాడు. మంగళవారం భార్యాభర్తల మధ్య మరోసారి గొడవ జరిగింది. ఈ క్రమంలో భర్త దాడి చేసి కొట్టడంతో తీవ్ర మనస్థాపానికి గురైన హీనా కౌసర్ ఇంట్లో ఉన్న ఎలుకల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. సమాచారం అందుకున్న బాధితురాలి తమ్ముడు అష్రఫ్ హుటాహుటిన అక్క ఇంటికి చేరుకున్నాడు. తన అక్కను ఆసుపత్రికి తీసుకెళ్లాలని ప్రయత్నించగా భర్త వసీమ్ అడ్డుకున్నాడు. ఎవరు ఆస్పత్రికి తీసుకెళ్లాల్సిన అవసరం లేదని, ఇక్కడే చనిపోయిన పరవాలేదంటూ అడ్డుపడ్డాడు. భావమర్ది అష్రఫ్‌పై కూడా దాడి చేశారని చెప్పారు. స్థానికులు అడ్డుకొని బాధితురాలిని మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అందిస్తుండగా భర్త రావడంతో బాధితురాలి కుటుంబ సభ్యులుపై ఒక్కసారిగా అతనిపై ఘర్షణకు దిగారు. అవుట్ పోస్ట్ పోలీసుల అడ్డుకొని బాధితురాలిని తిరుపతికి రెఫర్ చేయించారు. ఒకటో పట్టణ పోలీసులు విచారణ చేస్తున్నారు.

మరో భవన కార్మికుడు..

మదనపల్లె అర్బన్ : ఒంటరితనాన్ని భరించలేని భవన నిర్మాణ కార్మికుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మంగళవారం పట్టణంలో జరిగింది. బాధితుని కథనం మేరకు..స్థానిక అమ్మ చెరువుమిట్ట కు చెందిన రహంతుల్లా కుమారుడు చాంద్‌బాషా భవన నిర్మాణ కార్మికుడిగా పనిచే సుకుం టూ జీవనం చేస్తున్నాడు. కాగా భార్య వదిలి వెళ్లిపోవడంతో ఒంటరిత నాన్ని భరించలేక మద్యానికి అలవాటు పడ్డాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై, మద్యం సేవించి, ఆ మత్తులో బ్లేడుతో గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన బంధువులు అడ్డుకొని బాధితున్ని మదనపల్లె ప్రభుత్వా సుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు.

వేధింపులతో బాలిక బలవన్మరణం

- కోర్టులో లొంగిపోయిన నిందితుడు

యువకుడి వేధింపులకు తాళలేక గడ్డిమందు తాగి బాలిక ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పూలుకుంట పంచాయతీ గుంటికాడపల్లికి చెందిన గోపిక(14) గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు తెలిపారు. షీలా దేవేంద్ర అనే యువకుడు మృతురాలిని తరచూ వేధింపులు గురి చేస్తూ ఉండడంతో మనస్తాపానికి గురై గడ్డిమందు తాగిందని తెలిపారు. కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చికిత్స అందిస్తుండగా పరిస్థితి విష మించి మృతి చెందినట్లు తెలిపారు. బాలిక ఆత్మహత్యకు కారకుడైన దేవేంద్ర మంగళవారం లక్కిరెడ్డిపల్లి కోర్టులో లొంగిపోయాడని తెలిపారు. మృతురాలు తల్లి గెలిచే శోభరాణి ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి. రామకృష్ణ తెలిపారు.